సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం ၊ 6 ၊ సెప్టెంబర్ ၊ 2025



ఉపాధ్యాయ దినోత్సవం రోజే..

ఉపాధ్యాయ దినోత్సవం రోజే ఓ టీచర్ మృతి చెందాడు. అతని కుటుంబంలో విషాదం నింపింది.

- 8లో



యూరియా పంపిణీలో విఫలం

రైతులకు సరైన సమయంలో యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.

- 8లో



పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ పేర్కొన్నారు.

- 9లో

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి యోగితారాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నుంచి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు అందుకుంటున్న ఆలేరు ప్రభుత్వ కళాశాల బోటనీ లెక్చరర్ డాక్టర్ సౌజన్య





రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకుంటున్న సర్వేల్ గురుకుల కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకురాలు కొండ కవిత



బొమ్మలరామారం మండలం మర్యాల జెడ్పీ హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం పగిడిపల్లి నిర్మలజ్యోతి



బొమ్మలరామారం మండలం రామునితండా ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ నీలం శ్రీదేవి



సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ ఫిజిక్స్ టీచర్ దండుగుల యల్లయ్య



మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ దోమల రమేష్, చిత్రంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్

న్యూస్‌రీల్

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సంప్రదాయ పూజలు ఆగమ శాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్ఠించి ఊంజల్ సేవ చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధ స్వరం వినిపించారు. అంతకుముందు వేకువ జామున సుప్రభాత సేవ, గర్భాలయంలో నిజాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈఓ సత్యనారాయణ తెలిపారు. టీచర్లకు ఇంటర్ లేదా తత్సమానం, ఆయాలకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.అభ్యర్థుల వయసు 18 నుంచి 44 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాలు జతపరిచి సంబంధిత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 12 లోపు అందజేయాలని కోరారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

రాజాపేట : వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేటలో జరిగిన బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు చెప్పిన విధంగా ప్రాణనష్టానికి రూ.25లక్షలు, పంట నష్టానికి ఎకరానికి రూ.30వేలు చెల్లించాలన్నారు. రైతులకు అవసరం మేరకు యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, సందిల భాస్కర్‌గౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, వీరేశం, యాదగిరి, నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాములునాయక్, లక్ష్మణ్‌నాయక్, రాములునాయక్ పాల్గొన్నారు.

వెల్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

ఘనంగా గణనాథుల నిమజ్జనం

- శోభాయమానంగా సాగిన ఊరేగింపు
- యువత నృత్యాలతో కోలాహలం



భువనగిరి పెద్దచెరువులో గణనాథుడి నిమజ్జనం



భువనగిరి పట్టణంలో వినాయకుడి శోభాయాత్ర

భువనగిరి: తొమ్మిది రోజుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న గణనాథులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయకులను ఉంచి యువత నృత్యాలను చేస్తూ కోలాటాలు వేస్తూ జై గణేశా..బైబై గణేశా అంటూ నినాదాలు చేస్తూ మేళ తాళాల మధ్య బాణా సంచాలు కాల్చుతూ నిమజ్జానికి తరలించారు. పోయిరా గణపయ్య అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర, కేరళ, కళాబృందాలు, నృత్యాలు, అఘోరా వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భువనగిరిలో శోభాయాత్ర సాగిందిలా..

జిల్లా కేంద్రంలో గణేష్ శోభాయాత్ర ఐదు రూట్‌ల లో కొనసాగింది. పాత బస్టాండ్, కిసాన్‌నగర్, రాంనగర్, తాతానగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల నుంచి బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు వచ్చిన విగ్రహాలు.. అక్కడి నుంచి శోభాయాత్రగా పెద్ద చెరువుకు చేరాయి. భువనగిరి పెద్ద చెరువు వద్ద మధ్యాహ్నం సమయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనాన్ని ప్రారంభించారు. బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద భువనగిరి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధాన రహదారి వెంట భక్తులకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్, ఇన్నర్‌వీల్ క్లబ్, టీఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భువనగిరిలో రాత్రి 9 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర శనివారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. శ్రీరామ భక్త భజనమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలంలో శ్రీ పోల్కం రాములు రూ.1,12,100కు దక్కించుకున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

గణేష్ నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భువనగిరి పట్టణంలో డీసీపీ అక్షాంశ్‌యాదవ్ పర్యవేక్షణలో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు నిమజ్జనంపై ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు భారీగా మోహరించారు. తాతానగర్‌లో డీజేకి అనుమతి లేదని పోలీసులు సూచించడంతో ఉత్సవ సభ్యులు ధర్నాకు దిగారు.

85 శాతం విగ్రహాలు నిమజ్జనం

భువనగిరి పట్టణంతో పాటు చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, యాదగిరిగుట్ట, ఆలేరు, బీబీనగర్ మండల కేంద్రాలు, పాటు ఇతర మండలాల పరిధిలోని గ్రామాల్లో గణేష్ నిమజ్జనం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా, అందులో 85 శాతం వరకు నిమజ్జానికి తరలించారు.



భువనగిరిలో నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మోత్కూరులో గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు

విద్యార్థుల ఉన్నతిలో గురువులే కీలకం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, వేదికపై అదనపు కలెక్టర్, డీఈఓ

భువనగిరి: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను సమాజ మార్గదర్శకులుగా రూపుదిద్దడంలో ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలోనే రెండు దఫాలు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 7వ స్థానంలో ఉండడం వెనుక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి ఉందన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో నిలుపాలన్నారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 50 మంది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఈఓ సత్యనారాయణ, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, ఏడీ ప్రశాంత్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం

'నవాబుపేట'తో గుండాల సస్యశ్యామలం



నీటిని విడుదల చేసి కాలువలో పూలు చల్లి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు,ఎంపీ తదితరులు

గుండాల: నవాబుపేట రిజర్వాయర్ నీటితో గుండాల మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. శుక్రవారం నవాబుపేట రిజర్వాయర్ ద్వారా గుండాల మండలానికి సాగునీటిని విడుదల చేశారు. గంగమ్మకు పసుపు, కుంకుమలు పూలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువులను నింపి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు. కాలువలకు మరమ్మతులు చేపడతామన్నారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు. అప్పుల పాలు చేసి రైతులపై భారం మోపిందన్నారు. ప్రజాప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, ద్యాప కృష్ణారెడ్డి, ఇమ్మడి దశరథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరిపడా సరఫరా చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరిటౌన్ : యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు, అవసరం మేరకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ చేశారు. శుక్రవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. రైతులు వేకువజాము నుంచే పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జాప్యం చేయకుండా రైతులకు సరిపడా యూరియా అందించాలి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరు బాలరాజు, దాసరి పాండు తదితరులు పాల్గొన్నారు.

6 గంటల నుంచే క్యూలైన్

- పీఏసీఎస్‌ల వద్ద యూరియా కోసం బారులుదీరుతున్న రైతులు
- ఒక్క బస్తా కోసం గంటల తరబడి నిరీక్షణ



గుండాల సొసైటీ వద్ద చెప్పులు, బస్తాలను లైన్‌లో పెట్టిన రైతులు

అడ్డగూడూరు: యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అరకొరగా వస్తున్న యూరియా పూర్తిస్థాయిలో అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అడ్డగూడూరు సొసైటీకి గురువారం సాయంత్రం 444 బస్తాల యూరియా వచ్చింది. టోకెన్ ఇచ్చిన 228 మంది రైతులకు శుక్రవారం ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సమాచారం అందుకున్న రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీ కార్యాలయానికి తరలివచ్చి బారులు దీరారు. పొద్దస్తమానం నిరీక్షించినా యూరియా అందలేదు. శనివారం, సోమవారం రోజు పంపిణీ చేసేందుకు 210 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాలకు టోకెన్‌లు ఇచ్చామని వ్యవసాయ అధికారి పాండు రంగాచారి తెలిపారు.

గుండాల: గుండాల పీఏసీఎస్ వద్ద చెప్పులను క్యూలో పెట్టి రైతులు నిరీక్షించారు. ఒక్క బస్తా కోసం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు.



అడ్డగూడూరు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

పోలీసులతో వాగ్వాదం

మోత్కూరు: మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో యూరియా పంపిణీలో గందరగోళం చోటు చేసుకుంటుంది. శుక్రవారం ఉదయం యూరియా లోడ్ రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు సహకార సంఘం వద్దకు చేరుకున్నారు. సీరియల్ లేకుండా యూరియా పంపిణీ చేస్తున్నారని రైతులు ఆరోపించడంతో పోలీసులు టోకెన్‌ల ప్రకారం పంపిణీ చేశారు. 163 మంది రైతులకు ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున 326 బస్తాల యూరియా పంపిణీ చేశారు. ఇంకా 118 బస్తాల యూరియా మిగలగా టోకెన్లు లేని రైతులకు ఇచ్చారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, రైతులకు వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదారు రోజుల క్రితమే టోకెన్లు పొందిన తమకు యూరియా ఇవ్వకుండా వెనుక వచ్చిన రైతులకు ఇచ్చారంటూ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సింగిల్‌విండో సిబ్బందిని సీఐ మందలించి అందుబాటులో ఉన్న ఆరు బస్తాల యూరియాను మహిళా రైతులకు ఇప్పించి మిగిలిన రైతులకు సర్దిచెప్పారు. కాగా ఆధార్, పాస్‌బుక్, జిరాక్స్‌లు తీసుకున్న రైతులకు మాత్రమే యూరియా బస్తాలు పంపిణీ చేశామని సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళా రైతులు

ఆశల ఇంటికి రుణ సాయం

ఆర్థిక సమస్యలున్నవారికి మహిళా సంఘాల చేయూత

- రూ.50వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణం
- ఇప్పటి వరకు రూ.19.75 కోట్లు మంజూరు
- అత్యధికంగా భువనగిరి, బీబీనగర్‌లో..
- వేగం పుంజుకోవడానికి రుణం దోహదం



మాసాయిపేటలో రుణం తీసుకొని ఇల్లు నిర్మించుకుంటున్న వాకిటి మంజుల

సాక్షి యాదాద్రి: 'వలిగొండ మండలం సుంకిశాలకు చెందిన పోలేపల్లి అనురాధకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. కానీ, పని మొదలు పెడదామంటే చేతిలో చిల్లి గవ్వ లేదు. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ఆమెకు ప్రభుత్వం అండగా నిలిచింది. స్వయం సహాయక సంఘంలో పావలా వడ్డీకి రూ.2 లక్షల రుణం ఇప్పించింది. ఇందుకు గాను ప్రతి నెలా రూ. 8 వేల చొప్పున కిస్తులు చెల్లిస్తుంది. బేస్మెంట్ వరకు రూ.1 లక్ష బిల్లు వచ్చింది. చాలా కాలంగా ఇల్లు లేక ఇబ్బంది పడ్డామని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడం ఆనందంగా ఉందని లబ్ధిదారుల అనురాధ తెలిపారు'. ఇటువంటి వారు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు.

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. రెండు విడతల్లో 9,495 ఇళ్లు మంజూరయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాల వల్ల పలువురు నిర్మాణాలు చేపట్టేందుకు వెనుకాడుతున్నారు. అలాంటి వారికి స్వయం సహాయక సంఘాల నుంచి రుణాలు ఇప్పిస్తూ ఆర్థికంగా చేయూతనిస్తోంది.

రూ.19.75 కోట్లు ఇచ్చారు.. జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రూ.19.75 కోట్ల రుణాలు ఇచ్చారు. గ్రామాల్లో 1,202 ఇళ్లకు రూ.14.24 కోట్లు, ఆరు మున్సిపాలిటీల్లో 546 ఇళ్లకు రూ. 5.51 కోట్లు రుణాలు మంజూరు చేశారు. ఇందులో అత్యధికంగా భువనగిరి, బీబీనగర్‌లో వందమందికి పైగా రుణాలు మంజూరు చేశారు.

8వేల ఇళ్లకు మార్కింగ్

రెండు విడతల్లో 9,495 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 8 వేల ఇళ్లకు ముగ్గు పోశారు. చాలా మందికి మహిళా సంఘాల ద్వారా అత్యవసర రుణాలు అందాయి. అయితే ఇళ్లు మంజూరైనప్పటికీ ఆర్థిక ఇబ్బందుల వల్ల పనుల ప్రారంభానికి జాప్యం అవుతున్న విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. మహిళా సంఘాలతో మాట్లాడి రుణాలు ఇప్పించడంతో ఇళ్ల నిర్మాణంలో వేగం పెరిగింది.

స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, అంతర్గత పొదుపు నుంచి రుణం

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో మహిళా సంఘాలకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, సంఘం అంతర్గత పొదుపు నుంచి రుణం ఇచ్చారు. గతంలో రుణాలు తీసుకున్న సంఘాలకు మళ్లీ రుణం ఇచ్చారు. తీసుకున్న రుణాన్ని నాలుగు విడతల్లో వాయిదా పద్ధతిలో చెల్లించాలి. అయితే సంఘంలో సభ్యుల ఆర్థిక స్థితిని బట్టి రూ.50 వేల నుంచి రూ.2.50లక్షల వరకు రుణాలు ఇచ్చారు. ఈ రుణాన్ని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రుణం కింద ఇస్తున్నారు.

రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి

మాది మాసాయిపేట. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. కానీ, బేస్మెంట్ వరకు నిర్మిస్తేనే రూ.1 లక్ష బిల్లు వస్తుంది. తన ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇంటి నిర్మాణం ఆపేశారు. దీంతో మంజులకు గ్రామంలోని అఖిల మహిళా సంఘం రూ. 2,50 లక్షలు మంజూరు చేసింది. ఈ డబ్బులతో మంజుల ఇంటి నిర్మాణం ప్రారంభించింది. ప్రతి నెలా సంఘబంధానికి రూ. 10 వేల చొప్పున చెల్లిస్తుంది.

–వాకిటి మంజుల, లబ్ధిదారు, మాసాయిపేట

అప్పులున్నా రుణం ఇప్పిస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాం. గతంలో సంఘంలో అప్పులు ఉన్నా కూడా ఇంటి నిర్మాణం కోసం రూ. లక్ష వరకు రుణం ఇప్పిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు రూ.19.75 కోట్ల రుణాలు ఇచ్చాం. క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంది. రాష్ట్రంలో నెంబర్ వన్‌గా నిలిచింది.

–భాస్కర్, అదనపు కలెక్టర్


నల్లగొండలోని రామగిరిలో రామాలయం వద్ద గణనాథుడి శోభాయాత్ర


భువనగిరిలో గణనాథుడి శోభాయాత్రలో మహిళలు, యువతులు


భువనగిరిలో నృత్యం చేస్తున్న చిన్నారులు, యువతులు


శోభాయాత్రలో భాగంగా సూర్యాపేటలో కొమ్ము కోయ కళాకారుల నృత్య ప్రదర్శన


నల్లగొండలోని వీటీ కాలనీలో నృత్యాలు చేస్తున్న మహిళలు, యువతులు


కోదాడ: శివసాయినగర్‌లో గణనాథుడికి జలాభిషేకం నిర్వహించి నిమజ్జనం చేస్తున్న భక్తులు


భువనగిరిలో నిర్వహించిన వేడుకల్లో బేతాల వేషధారణలో మహారాష్ట్రకు చెందిన కళాకారులు


సూర్యాపేట పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద గణనాథుల నిమజ్జనాన్ని తిలకించేందుకు వచ్చిన ప్రజలు

క్లుప్తంగా

గ్యాస్ ఫిల్లింగ్ ఫ్యాక్టరీలో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బొమ్మలరామారం: మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో గల కీర్తి పెట్రో కమ్ గ్యాస్ ఫిల్లింగ్ ఫ్యాక్టరీని శుక్రవారం జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి కందగడ్ల వెంకటేశ్వర రావు తనిఖీ చేశారు. 15 కమర్షియల్ సిలిండర్లలో తక్కువ పరిమాణంలో గ్యాస్ రీఫిల్ చేసినట్లు అధికారులు గుర్తించి సిలిండర్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నకిరేకల్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన దుబ్బాక యాదగిరి అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో మద్యం బాటిల్‌లో పురుగులు మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబీకులు యాదగిరిని నకిరేకల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

చివ్వెంల(సూర్యాపేట): గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా చివ్వెంల మండల పరిధిలోని జగన్నాయక్ తండాలో డీజే నిర్వహిస్తున్న మండల పరిధిలోని రామ్‌కోటి తండాకు చెందిన ధరావతు శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేశ్వర్ శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా డీజే పెడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిమజ్జనానికి వెళ్లి కాల్వలో గల్లంతు

- తండ్రి, కుమారుడి ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి : వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వెళ్లిన తండ్రి, కుమారుడు గల్లంతయ్యారు. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రి, కుమారులు పున్నా సాంబయ్య(46), పున్నా శివమణి(20) తమ గ్రామంలోని వినాయకుడిని తమ కాలనీవాసులతో కలిసి వేములపల్లి మండల కేంద్రం సమీపంలో ఎడమ కాల్వలో నిమజ్జనం చేయడానికి వచ్చారు. నిమజ్జనం అనంతరం తండ్రి, కుమారుడు తమపై ఉన్న రంగులను శుభ్రం చేసుకోవడానికి కాల్వలో దిగిన సమయంలో ప్రమాదవశాత్తు తండ్రి సాంబయ్య జారిపడ్డాడు. తండ్రిని కాపాడుదామని కుమారుడు ప్యాంటును అందించి కాపాడే సమయంలో కాల్వలోకి జారిపోయాడు. కాల్వలో బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో వారు గల్లంతయ్యారు. సాంబయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ

కొనసాగుతున్న గాలింపు

పున్నా సాంబయ్య, పున్నా శివమణి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హేమలత ఉన్నారు.

అనాథగా మిగిలిన కుమార్తె..

ప్రమాదానికి గురైన సాంబయ్యకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య చనిపోయింది. సాంబయ్య వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు శివమణి ఐటీఐ చదువుతుండగా, కుమార్తె తుంగపాడు గ్రామంలోని గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తండ్రి, అన్న కాల్వలో గల్లంతు కావడంతో బాలిక అనాథగా మిగిలింది.


సాంబయ్య (ఫైల్)


శివమణి (ఫైల్)

భద్రతా ఏర్పాట్లు కరువు

నిమజ్జన ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రంగా కొంతమందిని మాత్రమే సిబ్బందిని నియమించారని తెలిపారు. గజ ఈతగాళ్లు లేకపోవడం వల్లే వారిని కాపాడలేకపోయినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

తిరుమల తరహాలో యాదగిరి క్షేత్రం అభివృద్ధి కావాలి

- ఈవో వెంకట్రావ్‌కు సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరిగుట్ట: తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయ తరహాలో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ ఈవో వెంకట్రావ్‌కు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఈవో వెంకట్రావ్ మర్యాద పూర్వకంగా కలిశారు. యాదగిరి క్షేత్రానికి ఈవోగా తనను కొనసాగిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపి, శ్రీస్వామి వారి లడ్డూ ప్రసాదం, శేష వస్త్రాన్ని అందజేశారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, ఉత్తర్వులను తీసుకోవాలని సీఎం సూచించారు.


సీఎంకు మొక్క అందజేస్తున్న ఈవో

ఉపాధ్యాయ దినోత్సవం రోజే విషాదం

- ఆలేరులో ప్రైవేట్ టీచర్ మృతి
- వైద్యం వికటించడమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నర్సింగ్‌హోం ఎదుట ఆందోళన

ఆలేరు: ఉపాధ్యాయ దినోత్సవం రోజే ఓ టీచర్ మృతి చెందారు. అతని కుటుంబాన్ని విషాదంలో ముంచింది. శుక్రవారం అస్వస్థతకు గురై చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించిన సదరు ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన ఆలేరు పట్టణంలో జరిగింది. వైద్యం వికటించడమే టీచర్ మృతికి కారణమని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. మృతదేహంతో ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా.. యాదగిరిగుట్ట మండలం కమటంగూడేనికి చెందిన ఏనుగుల ఉదయ్‌కుమార్(42) భువనగిరిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య కావేరి, మోహన, ఆద్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం ఉదయ్‌కుమార్‌కు ఛాతిలో నొప్పి రావడంతో అతన్ని చికిత్స కోసం ఆలేరులోని ఓ నర్సింగ్‌హోంకు కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. నొప్పి తగ్గేందుకు నర్సింగ్‌హోం డాక్టర్ సూచన మేరకు ఉదయ్‌కి ఆసుపత్రి సిబ్బంది ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంటికి వెళుతున్న క్రమంలో ఉదయ్‌కు నొప్పి రావడంతో మళ్లీ ఆసుపత్రికి వచ్చాడు. ఫిట్స్ వస్తున్నాయనే అనుమానంతో నర్సింగ్‌హోం వర్గాలు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశాయి. ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతున్న క్రమంలో ఉదయ్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఆసుపత్రికి వచ్చిన ఉదయ్‌కుమార్‌ను డ్యూటీ డాక్టర్ పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించినట్టు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్ 'సాక్షి'కి తెలిపారు.

ఆగ్రహించిన కుటుంబసభ్యులు

ఆగ్రహించిన కుటుంబసభ్యులు నర్సింగ్‌హోంకు వచ్చి వైద్యం వికటించడం వల్లనే ఉదయ్ మరణించాడని డాక్టర్ ప్రతాప్‌రెడ్డితో వాదనకు దిగారు. నొప్పి తగ్గటానికే ఇంజెక్షన్ ఇచ్చానని డాక్టర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. సమాచారం తెలుసుకున్న వామపక్షాల నాయకులు ఆసుపత్రికి చేరుకొని నర్సింగ్‌హోం వర్గాల తీరును తప్పుబట్టారు. సరైన పరీక్షలు చేయకుండానే ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల వైద్యం వికటించడమే ఉదయ్ మరణానికి కారణమని, డాక్టర్‌పై చర్య తీసుకోవాలన్నారు. జిల్లా వైద్యాధికారి వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వరకు ఆసుపత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి కుటుంబసభ్యులతో కలిసి నాయకులు ఆందోళనకు దిగారు. ట్రాఫిక్‌కు కాసేపు అంతరాయం కలిగి, పరిస్థితి గందగోళంగా మారడంతో సీఐ యాలాద్రి, ఎస్‌ఐ వినయ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసేందుకు కృషి చేశారు. భార్య కావేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు అనంతరం డాక్టర్ ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు. మృతికి గుండెపోటా? అసలు కారణం పోస్టుమార్టం తర్వాతనే తెలుస్తుందని సీఐ తెలిపారు.


నర్సింగ్‌హోం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

పరిహారం చెల్లించాలి

ఉదయ్‌కుమార్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ డిమాండ్ చేశారు. సుధా నర్సింగ్ హోంలో గతంలో కూడా అనేక సంఘటనలు జరిగాయని కలెక్టర్, వైద్యాధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యూరియా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : రైతులకు సరైన సమయంలో యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరత పట్ల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, కాళేశ్వరం ప్రాజెక్టుపై కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో యూరియా కొరత లేదని, రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులే యూరియా లేదటుంటే.. సీఎం రేవంత్ మాత్రం సరిపడా ఉందని అబద్ధం చెపుతున్నారన్నారు. 2014 కు ముందు నీళ్లకోసం కొట్టుకున్నోళ్లు.. నేడు యూరియా కోసం కొట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. హాస్టళ్లల్లో భోజనం సరిగా లేదని పిల్లలే ధర్నా చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రేవంత్ రెడ్డికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని ఆరోపించారు. ఒకపక్క వందల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తుంటే.. నల్లగొండ గడ్డపైన ఉన్న ఎస్ఎల్‌బీసీ ఉదయ సముద్రం ఎండిపోతుందన్నారు. ఎప్పటికైనా కోమటిరెడ్డి, సీఎం రేవంత్‌లు బీజేపీలో చేరేవాళ్లేనని విమర్శించారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

ఖమ్మంక్రైం: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ కాల్వకట్ట ప్రాంతానికి చెందిన సాయిప్రియ(25)కు నాలుగేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన దాసోజు మణికంఠతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, అనారోగ్యంతో బాధపడుతున్న బంధువును చూడడానికి గత నెల 29న సాయిప్రియ ఖమ్మంకు వెళ్లింది. ఈక్రమంలో గురువారం సాయంత్రం డాబాపై దుస్తులు ఆరవేస్తుండగా ఇనుప వైరుకు విద్యుత్ తీగలు తాకడంతో కరెంట్ సరఫరా అయింది. దీంతో షాక్‌కు గురైన ఆమెను తల్లిదండ్రులు పాండురంగాచారి, దుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామన్నపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన నకిరేకంటి మహేష్(40) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై రామన్నపేటకు బయలు దేరాడు. సిరిపురం గ్రామ శివారులో వెనుక నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో మహేష్ రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన యువకుడు 108కు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.


మహేష్(ఫైల్)

విద్యనేర్పిన గురువులకు ఎమ్మెల్యే సన్మానం

మోత్కూరు : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తనకు బాల్యంలో చదువు చెప్పిన గురువులను ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానికంగా ఘనంగా సన్మానించారు. మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కల్వల ప్రకాష్‌రాయుడు, శాలిగౌరారం మండలానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాంరెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించారు.



తనకు పాఠాలు బోధించిన గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఇసుక లారీ పట్టివేత

హుజూర్‌నగర్ : మండలంలో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామానికి తరలిస్తున్నారనే సమాచారం అందింది. సీఐ తన సిబ్బందితో వేపల సింగారంలో ఇసుక లారీని పట్టుకోగా.. లారీ డ్రైవరు రాంబాబు, యజమాని లంకెల శ్రీనివాస రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని గుర్తించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హుజూర్‌నగర్ : వ్యభిచార గృహంపై పోలీసుల దాడి చేసి ముగ్గురు విటులను, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఈసంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని చైతన్య కాలనీలోని ఒక ఇంటిలో వ్యభిచారం నడిపిస్తున్నారని సమాచారం మేరకు దీంతో సీఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇంటిలో ఉన్న ముగ్గురు మహిళలు, ముగ్గురు విటులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని రెండు ఆటోలు, మూడు సెల్ ఫోన్లు, మూడు కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. విటులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

- పలువురికి గాయాలు

శాలిగౌరారం: వినాయక నిమజ్జనంలో శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్‌కాలనీలో శుక్రవారం రాత్రి యువకుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. మార్కెట్ కాలనీలో ఒక వర్గానికి చెందిన యువకులు నకిరేకల్ నుంచి తన స్నేహితులను పిలిపించారు. రాత్రి 11 గంటల సమయంలో శోభాయాత్ర జరుగుతుండగా.. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇరువర్గాలకు చెందిన యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వినాయక విగ్రహాలను శాలిగౌరారం ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

- అంతర పంటల సాగుపై వ్యవసాయాధికారి సూచనలు



గుర్రంపోడు : పండ్ల తోటలు సాగు చేసే రైతులు మొక్కలు నాటిన తర్వాత కాపు వచ్చే 4–5 సంవత్సరాల వరకు అంతర పంటలుగా స్వల్పకాలిక పంటలైన మునగ, చిక్కుడు జాతి పంటలు, వేరుశనగ, పెసర, మినుము, కూరగాయలు, పుచ్చ సాగు చేసుకుని ఆదాయం పొందే వీలుంది. అంతర పంటల సాగుపై మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి సూచనలు ఆయన మాటల్లోనే..

అంతర పంటలతో లాభాలు

- పండ్లతోటలు ఎక్కువ దూరంలో నాటడం వల్ల ఎక్కువ నీటి తడులు ఇవ్వడంతో భూమిలో కలుపు పెరిగే అవకాశం ఉంది. ఈ కలుపును అంతర పంటలు నివారిస్తాయి.
- సహజ వనరులైన భూమి, నీరు, సూర్యరశ్మి సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.
- వివిధ రకాల అంతరపంటల సాగువల్ల నేలలో వివిధ లోతుల్లో గల తేమ పోషక పదార్థాలు క్రమబద్ధంగా ఉపయోగపడటమేకాకుండా నేల లోపలి వరకు గుల్లబారి తర్వాత పంటలు బాగా పెరగటానికి దోహదపడుతుంది.


గుర్రంపోడులో బత్తాయి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న వేరుశనగ

- ప్రధాన పంటలతోపాటు అంతరపంటలు ఒకే సమయంలో పండించడం వల్ల రైతులకు రాబడులు స్థిరంగా ఉంటాయి.
- అంతరపంటలుగా అపరాల పంటలు సాగుచేసుకుంటే భూసారం అభివృద్ధి చెందుతుంది.

వేసుకోదగిన అంతర పంటలు

మామిడి : నేల లోతు, ఎంపిక చేసుకునే రకాన్ని బట్టి మామిడి మొక్కలను 7–10 మీటర్ల దూరంలో నాటుతారు. కాబట్టి మొక్కల మధ్య ఖాళీ స్థలం ఎక్కువగా ఉంటుంది.

- లేత తోటల్లో సూర్యరశ్మి, గాలి ప్రసారం బాగా ఉంటుంది. ఇందులో అంతర పంటలుగా కూరగాయలు, తక్కువ ఎత్తు పెరిగే పైర్లు బొప్పాయి, మునగ లాంటి మొక్కలు వేసుకోవచ్చు. పెద్ద తోటల్లో నీడలో పెరిగే అల్లం, పసుపు పైర్లు వేసుకోవచ్చు. దీర్ఘకాలంలో ఆదాయానిచ్చే ఎర్రచందనం, శ్రీగంధం కూడా సాగు చేసుకోవచ్చు.

బత్తాయి, నిమ్మ : బత్తాయి, నిమ్మ మొక్కలను 7×7 మీటర్ల దూరంలో నాటుతాం. కాబట్టి కాపునకు వచ్చే ఐదు సంవత్సరాల వరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. వేరుశనగ, అపరాల రకాలైన కంది, మినుము, పెసరలతోపాటు దోస, ఉల్లి, పుచ్చ పంటలు వేసుకోవచ్చు. మిరప, టమాటో, వంగ పైర్లు వేయకూడదు. ఈ పైర్లు వేయడం వల్ల నులిపురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది.

సపోటా : సపోటాను కూడా 7×7 మీటర్ల దూరంలో నాటుకోవడం వల్ల అంతరపంటలుగా బొప్పాయి, మునగ లాంటి పంటలు వేసుకోవచ్చు. కూరగాయల పంటలైన టమాట వంగ, దోసలను కూడ సాగుచేయొచ్చు. చెట్ల వరుస మధ్యలో కొందరు ఎర్రచందనం, శ్రీగంధం కూడా సాగు చేసుకోవచ్చు.

బిందు సేద్యం ద్వారా అంతర పంటల సాగు

పండ్లతోటల్లో అంతరపంటల సాగులో కొన్ని మెళుకువలు పాటించాల్సి ఉంటుంది. ప్రధానంగా డ్రిప్ ద్వారా నీరందించినప్పుడు అంతరపంటల సాగుకు ప్రత్యేకంగా లాటరల్ పైపు లైన్ వేసుకోవాలి. దీని ద్వారా ప్రధాన పంటకు, అంతరపంటకు వేర్వేరుగా సరిపడా నీరు అందించవచ్చు.